క్లుప్తంగా

సెల్ టవర్‌కు నిప్పంటించిన మావోయిస్టులు

చర్ల: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో పర్యటనకు ఒక రోజు ముందు రాత్రి మావోయిస్టులు బీజాపూర్ జిల్లాలోని సెల్ టవర్‌కు నిప్పంటించారు. శుక్రవారం అర్ధరాత్రి దంతెవాడ పక్కనే ఉన్న బీజాపూర్ జిల్లా మొదక్‌పాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న కవాలిలో ఉన్న జియో మొబైల్ టవర్ వద్దకు చేరుకున్న మావోయిస్టులు.. టవర్‌కు సంబంధించిన ప్యానల్ బోర్డు, జనరేటర్ వద్ద తాటి కమ్మలు, కట్టెలు పెట్టి నిప్పంటించారు. దీంతో ప్యానెల్ బోర్డు, జనరేటర్, కేబుళ్లు దగ్ధమయ్యాయి. సంఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న మొదక్‌పాల్ పోలీసులు శనివారం మధ్యాహ్నం అక్కడకు చేరుకుని వివరాలను సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం సంఘటన వివరాలిలా ఉన్నాయి. దమ్మపేటకు చెందిన దారబోయిన హరిబాబు (26), ఏపీ రాష్ట్రం ఏలూరుకు చెందిన హరిబాబు బంధువు శెట్టిపల్లి నర్సింహారావులు ఇద్దరు కలిసి సుజాతనగర్ నుంచి చండ్రుగొండకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో మార్గ మధ్యలోని తిప్పనపల్లి వద్ద సత్తుపల్లి ఓపెన్ కాస్టు నుంచి బొగ్గులోడుతో ఎదురుగా వస్తున్న టిప్పర్ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమైన హరిబాబు సంఘటనస్థలోనే మృతి చెందాడు. తీవ్రగాయలతో అపమారకస్థితిలో ఉన్న నర్సింహారావును చికిత్స నిమిత్తం కొత్తగూడెంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు హరిబాబుకు భార్య జ్యోతి, పది నెలల బాలుడు ఉన్నారు. ఏఎస్ఐ పాపారావు సంఘటనస్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం కొత్తగూడెంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గురుకుల ప్రవేశాలకు 7 నుంచి దరఖాస్తులు

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరానికి అడ్మిషన్ దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బండారుపల్లి రవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం రాసిన, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు బీఎస్సీ, బీకామ్, బీఏ ఆయా గ్రూప్‌ల వారిగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో ఈ నెల 7 నుంచి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

తునికాకు కట్టకు రూ.3.31గా ఖరారు

గుండాల: ఈ ఏడాది సేకరించనున్న 50 ఆకుల తునికాకు కట్టకు రేటు నిర్ణయించారు. గత ఏడాది 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3.03 పైసలు ఉండగా ఈ ఏడాది రూ.3.31 పైసలుగా ధర నిర్ణయించారు. ఈ మేరకు మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో శనివారం కార్మికులు, తునికాకు పోరాట కమిటీ, కాంట్రాక్టర్ల మధ్య చర్చలు జరిగాయి. చర్చల్లో కాంట్రాక్టర్లు రమేష్ రెడ్డి, మంతజిములు సయ్యద్ అజ్జు, ఖుద్దూస్, తునికాకు పోరాట కమిటీ అధ్యక్షులు గుంపిడి వెంకటేశ్వర్లు, చిన చంద్రన్న, సీపీఐ, ఎన్డీ, ప్రజాపంథా, తుడుందెబ్బ, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'సీఓఈ'లో సీటు

అశ్వారావుపేటరూరల్: కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ప్రవేశ పరీక్షలో అశ్వారావుపేట మండలం కోయ రంగాపురం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని సాయిప్రియ ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు శనివారం విడుదలైన ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత పొందడంతో సీఓఈలో సీటు పొందేందుకు అర్హత సాధించింది. దీంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సకాలంలో చెల్లింపుపై పన్ను రాయితీ

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ ఇంటి పన్నులు ఏప్రిల్ నెలాఖరులోగా చెల్లిస్తే.. ఐదు శాతం రాయితీ అందిస్తామని మణుగూరు కమిషనర్ టి.ప్రసాద్ తెలిపారు. శనివారం కార్యాలయంలోని చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ.. 2025–26 సంవత్సరానికి ఇంటి పన్నులకు సంబంధించి మున్సిపాలిటీ అందిస్తున్న ఈ రాయితీని ప్రజలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా వర్షపు నీరు, ఇళ్లలోని వృథా నీరు ఆ గుంతల్లోకి వెళుతుందని తెలిపారు. దీనివల్ల డ్రెయినేజీ పొంగే సమస్యకు పరిష్కారం దొరగడం తోపాటు, భూగర్భజలాల పెంపునకు అవకాశం ఉంటుందని వివరించారు.

కల్యాణానికి సర్వం సిద్ధం

- ముస్తాబైన రామాలయాలు
- ఏర్పాట్ల హడావిడితో ఆలయాల్లో సందడి
- పర్ణశాలకు ముందుగానే ప్రారంభమైన భక్తుల తాకిడి



దుమ్ముగూడెం: పర్ణశాలలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం



దమ్మపేట: ముష్టిబండ రామాలయ ప్రాంగణంలో రోకళ్లతో పసుపు కొడుతున్న మహిళలు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీసీతారాముల కల్యాణానికి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నేడు జరగనున్న జగదభి రాముడి కల్యాణానికి పర్ణశాల దేవస్థానం అధికారులు, పంచాయతీ అధికారులు సుందరంగా తీర్చిదిద్దారు. కల్యాణం జరిగే మండపంతో పాటు అలయ ప్రాంగణం అంతా క్లాత్ డెకరేషన్ చేపట్టారు. పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి, శానిటేషన్ ఏర్పాట్లు చేపట్టారు. పర్ణశాల గ్రామంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్, దేవస్థానం అధికారులు ఉండి శ్రీరామనవమి వేడుకలను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు. పర్ణశాల వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు గోదావరి నదీలో ఇబ్బందులు ఉండటంతో ఇరిగేషన్ జేఈ రాజ్‌సుహాస్ సిబ్బంది మస్తాన్ వలీ గోదావరిలో 5హెచ్‌పీ మోటార్‌ను ఏర్పాటు చేసి స్నానఘట్టాలకు నీటిని ఏర్పాటు చేశారు. గోదావరి దగ్గర గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. ఎండలు బాగా ఉండటంతో పంచాయతీ ఆధ్వర్యంలో మోటార్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కాగా పర్ణశాలలో భక్తుల సౌకర్యార్థం అధికారయంత్రాంగం సరైన వసతులు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు విమర్శలు చేస్తున్నారు. నవమి సందర్భంగా పర్ణశాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు సీఐ అశోక్ ఆధ్వర్యంలో ఎస్ఐలు వెంకటప్పయ్య, గణేష్, పోలీస్ సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. అయితే, ఇప్పటికే భక్తులు భారీగా పర్ణశాలకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

దమ్మపేట: మండల పరిధిలో ఉన్న రామాలయాలకు రంగులు వేసి, హనుమాన్ జెండాలతో ముస్తాబు చేశారు. శనివారం ముష్టిబండ గ్రామంలోని రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని, ఆలయాన్ని పరిశుభ్రం చేసిన అనంతరం.. శ్రీసీతారాముల కల్యాణ మంగళకర వేడుకల్లో భాగంగా రోకళ్లతో పసుపు కొమ్ములను కొట్టి, పసుపును తయారు చేశారు. ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానాలు చేయించారు. ఆలయంలో హనుమాన్ చాలీసాను, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, ఘనంగా నిర్వహించారు.

ములకలపల్లి: మండల కేంద్రంలోని భక్త అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. శనివారం పెద్ద ఎత్తున మహిళలు హాజరై, కల్యాణ తలంబ్రాలను కలిపారు. తొలుత స్వామివారికి పంచామృత అభిషేకాలు, ఫలరసాల అభిషేకాలు నిర్వహించారు.



భద్రాచలంలో భక్తులు..



ములకలపల్లి: తలంబ్రాలు కలుపుతున్న మహిళలు



గోదావరి వద్ద అధికారులు ఏర్పాటు చేసిన గజ ఈతగాళ్లు



దమ్మపేట: సుధాపల్లిలో నవమికి ముస్తాబైన రామాలయం



దుమ్ముగూడెం: పర్ణశాల నారచీరల వద్ద భక్తుల సందడి

భద్రాద్రికి పోటెత్తిన భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాద్రిలో అత్యంత వైభవంగా జరిగే శ్రీసీతారాముల కల్యాణ వేడుకకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఒక్క రోజు ముందుగానే భద్రాద్రి చేరుకున్నారు. దీంతో భక్త జనంతో భద్రాద్రి భక్తాద్రిగా మారిపోయింది. పట్టణంలోని పుర వీధులు భక్తులతో సందడి వాతావరణం సంతరించుకున్నాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లతో బారుతీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. పుణ్య స్నానాలు ఆచరించే భక్తులతో గోదావరి నది తీరం కిక్కిరిసి పోయింది. హనుమాన్ మాలధారులు సైతం అధిక సంఖ్యలో రామయ్య దర్శనానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణం రామనామ స్మరణతో మార్మోగి పోయింది. భక్తులు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



స్వామివారి ఉత్సవాలకు భారీగా హాజరైన భక్తులు

చెట్టు నీడే భక్తుల పానుపై..

భద్రాచలంటౌన్: నిద్ర సుఖమెరుగదని పెద్దలు పెద్దలు చెబుతుంటారు. అటువంటి సందర్భమే భద్రాద్రి వచ్చిన భక్తులకు ఎదురైంది. గోదావరి కరకట్టపై ఉన్న చెట్టు నీడనే వారికి పానుపైంది. భద్రాచలం శ్రీసీతారాచంద్ర స్వామివారి కల్యాణం తిలకించేందుకు కాలినడకన వస్తానని మొక్కున భక్తులు ఒక్క రోజు ముందుగా భద్రాద్రి చేరుకుకోవడం ఆనవాయితి. అలా రోజుల తరబడి కాలినడకన భద్రాద్రి చేరుకున్న భక్తులు పూర్తిగా అలసిపోతారు. ఇక్కడికి రాగానే లాడ్జి రూముల రేట్లు ఆకాశాన్ని అంటుతుండటంతో.. వారు విశ్రాంతి తీసుకోడానికి కరకట్టపై ఉన్న చెట్లను ఎంచుకుంటున్నారు. అక్కడే వంటవార్పు చేసుకుని చెట్ల పార ఎండలోనే సేద తీరుతున్నారు. తగిన ఏర్పాటు చేయక పోవడంపై భక్తులు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చెట్ల నీడలో సేద దీరుతున్న భక్తులు

సీతమ్మకు బంగారు పట్టుచీర

భద్రాచలంఅర్బన్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం సీతారాముల కల్యాణానికి పట్టువస్త్రాలు, సీతమ్మకు బంగారు పట్టుచీరను.. చేనేత మగ్గంపై నేత నేసిన సిరిసిల్ల చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ శనివారం భద్రాచలం వచ్చి ఆలయ అధికారులకు అప్పగించారు. హరిప్రసాద్ పది రోజులపాటు శ్రమించి.. చీరకొంగులో భద్రాద్రి ఆలయ మూలవిరాట్ చిత్రాలు నేశారు. చీర కింది బార్డర్‌లో శంకు, చక్రాలు, హనుమంతుడు, గరుత్మంతుడి చిత్రాలు వచ్చే విధంగా రూపొందించారు. చీర మొత్తం శ్రీరామ శ్లోకాన్ని 51 సార్లు వచ్చేలా చీరను నేయడం విశేషం. చీరలో గ్రాము బంగారు జరీ, పట్టుదారం ఉపయోగించి ఏడు గజాల పొడవు, 48 అంగుళాల వెడల్పు, 800 గ్రాముల బరువు ఉండేలా చూశారు. మూడేళ్లుగా శ్రీసీతారాముల కల్యాణానికి హరిప్రసాద్ ప్రత్యేకంగా చేనేత మగ్గంపై చీరలు నేసి అందిస్తున్నారు.



బంగారు పట్టుచీరను అప్పగించేందుకు భద్రాచలం చేరుకున్న హరిప్రసాద్ దంపతులు

ట్రైబల్ మ్యూజియం అభినందనీయం



ఆదివాసీ కళాఖండాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు, పీఓ

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజన సంస్కృతి సాంప్రదాయాలతో పాటు ఆచార వ్యవహారాలు నేటి తరానికి తెలిసే విధంగా ఐటీడీఏ అధికారులు ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ట్రైబల్ మ్యూజియాన్ని వారు శనివారం సందర్శించి మ్యూజియంలో ఏర్పాటు చేసిన పెయింటింగ్ చిత్రాలు, కళాఖండాలను, పాతకాలపు మట్టి ఇండ్లు, చిన్నారులకు నిర్మాణం చేపట్టిన ఆట స్థలం బోటింగ్ పాయింట్, బాక్స్ క్రికెట్, బీచ్ వాలీబాల్ స్థలాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దట్టమైన అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసీ గిరిజనుల జీవన విధానాలు, సాంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, వారు పూజించే దేవతామూర్తులు సహజత్వాన్ని ఉట్టిపడేలా ఉన్నాయని తెలిపారు. మ్యూజియంలోని పాతకాలపు కళాఖండాలను, గిరిజనులు ఉపయోగించే పనిముట్లను చూస్తే తమ చిన్ననాటి స్మృతులు గుర్తుకు వస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం పీఓ ఎమ్మెల్యేలకు మ్యూజియంలోపల కళాఖండాలను, పెయింటింగ్ చిత్రాలను, మట్టి ఇళ్లను చూపించి వాటికి సంబంధించిన చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అచ్యుతాపురం ఎస్సీ కాలనీ, నారంవారిగూడెం ఎస్సీ కాలనీ, కొత్త మామిళ్లవారిగూడెం ఎస్సీ కాలనీ, వినాయకపురం ఎస్సీ కాలనీ, నారాయణపురం ఎస్సీ కాలనీ గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం పర్యటించారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.కోటి 82లక్షల 50వేలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే కోయ రంగాపురం గ్రామంలో పెదవాగు కాలువపై ఐటీడీఏ నిధులు రూ.10లక్షల వ్యయంతో నిర్మించి వంతెనను ప్రారంభించారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, పీఆర్ డీఈఈ శ్రీధర్, ఏఈఈ అక్షిత, సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, ఆలయ చైర్మన్ నరాల శ్రీనివాసరావు, నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్‌బాబు, సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్, మిండా హరి, ఆకుల శ్రీను, వేల్పుల సత్యనారాయణ, నల్లపు లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కాలు అమర్చిన ఎమ్మెల్యే

దమ్మపేట: రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన బాధితుడికి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం కృత్రిమ కాలును అమర్చారు. మండలంలోని చిన్నగొల్లగూడెం గ్రామానికి చెందిన జోనెబోయిన మల్లయ్య రోడ్డు ప్రమాదంలో మోకాలి కింది భాగాన్ని పూర్తిగా కోల్పోగా.. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జర్మనీ టెక్నాలజీతో తయారుచేసిన కృత్రిమ కాలును తెప్పించిన స్వయంగా అతడి మోకాలికి తొడిగారు.

నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అశ్వాపురం: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో ఎస్‌కేటీ ఫంక్షన్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో అమిత్‌షా అహంకారపూరిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్నబియ్యంపై ప్రచారం సరికాదు

బూర్గంపాడు: కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని తామేదో గొప్పగా ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవటం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తాళ్లగొమ్మూరులోని రేషన్ దుకాణం వద్ద శనివారం ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తున్నామని, ఆ పథకం మొత్తం తమ గొప్పగా ప్రచారం చేసుకోవటం సిగ్గుచేటన్నారు. పార్టీ నాయకులు కుంజా ధర్మ,గుగులోత్ మోహన్, బీరక సాయిశ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ప్రతీ రేషన్ దుకాణం వద్ద ప్రధాని మోదీ ఫొటో ఫ్లెక్సీ పెట్టాలని స్థానిక బీజేపీ మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు అందిస్తున్న సన్న బియ్యాన్ని ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రేషన్ బియ్యంలో కేంద్రం వాటానే అధికంగా ఉందని, ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జల్లిపల్లి అరవింద్, చిట్టి శ్రావణ్‌కుమార్, కలకోటి కృష్ణారావు, ఎస్.పుష్కరకుమార్, నరేష్ పాల్గొన్నారు.

వెండి కిరీటాలు వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన కొప్పుల శ్రీనివాసరెడ్డి–వనజ దంపతుల కుమారుడు వినయ్–శ్రావణి, కెనడాలో ఉంటున్న కుమార్తె మాధురి–గౌతమ్‌రెడ్డి దంపతులు రూ.లక్షా 50 వేల విలువ ఉన్న రెండు వెండి కిరీటాలు బహూకరించారు. కొప్పుల శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని శనివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ దేశాభివృద్ధికి, బహుజనుల కోసం చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న కాలంలోనే హరిత విప్లవం ప్రారంభం అయిందని పేర్కొన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.


– సాక్షి నెట్‌వర్క్




భద్రాచలంటౌన్: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీఓ, అధికారులు




మణుగూరురూరల్: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు



అశ్వారావుపేటరూరల్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జారే



మణుగూరురూరల్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రావు



మణుగూరురూరల్: జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు